



విజయనగరం: జగన్నాథుని దర్శనానికి భక్తుల బారులు

వైభవంగా రథయాత్ర

● రథంపై జగన్నాథుని దర్శించుకున్న భక్తులు ● విజయనగరమంతా కోలాహలం

విజయనగరం రూరల్, జూలై 7: జిల్లా వ్యాప్తంగా జగన్నాథుని రథయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిలకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయంలో పూజలు అయ్యాక స్వామి రథంపై ఆశీనులయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణ, భక్తులు జై జగన్నాథ నామస్మరణ మధ్య రథయాత్ర సాగింది. బొబ్బిలి, గజపతి నగరం, ఎస్.కోట, జామి, కొత్తవలస, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో రథయాత్ర వైభవంగా జరిగింది. సాయంత్రం 4.30 గంటల నుంచి రథంపై ఆశీనులైన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. విజయ నగరంలోని పురాతన జగన్నాథ స్వామి ఆలయం, దాసన్నపేట ఆలయం వద్ద స్వామిని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దర్శించుకున్నారు. అదే విధంగా సాయంత్రం జగన్నాథ స్వామి ఆలయం నుంచి రథం నవాబుపేట జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం జంక్షన్‌లో రథం ఉంచగా భక్తులు రథంపైకి వెళ్లి స్వామికి పూజలు నిర్వహించారు. సంతపేట జగన్నాథ స్వామి ఆలయంలోనూ భక్తుల కోలాహలం కన్పించింది. కన్యకాపరమేశ్వరీ ఆలయం, కర్రల మార్కెట్, చిక్కాలవీధి, ఉల్లివీధిలోని కాళ్ల నాయుడు మందిరం రోడ్డు తదితర ప్రాంతాల్లో భక్తుల కోలాహలం కనిపించింది. ఈ ఆలయాల్లో సోమవారం నుంచి స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



విజయనగరంలో జగన్నాథుని ఊరేగింపు



డెంకాడ స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు

వినియోగదారులకు ఈనెల 8వ తేదీనుంచి ఇసుక ఉచితంగా అందనుంది. ఇందుకోసం అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మూడు స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేయనున్నారు. వీటిలో 92వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. కొత్తవలస, డెంకాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతాల్లో ఇసుక యార్డులు ఉన్నాయి. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇసుకను స్టాక్ పాయింట్లకు తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు.

విజయనగరం
(ఆంధ్రజ్యోతి)

నేటి నుంచే ఇసుక ఉచితం

● మూడు స్టాక్ పాయింట్ల నుంచి సరఫరాకు ప్రణాళిక ● జిల్లాలో 92 వేల టన్నుల ఇసుక సిద్ధం

కొత్త ఇసుక విధానంలో వినియోగదారులు గనుల శాఖకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఇసుకను మనుషులతో తవ్వి తీయించి, లారీల్లో లోడ్ చేయించి, తిరిగి డిపోలకు తరలించినందుకు గనుల శాఖకు కొంత ఖర్చవుతుంది. దీన్నే నిర్వహణ (ఆపరేషనల్) వ్యయంగా పిలుస్తారు. రీచ్‌లు, డిపోలకు మధ్య ఉండే దూరాన్ని బట్టి ఈ ఫీజులు ఉంటాయి. రోజుకు ఒక్కొక్కరికీ సగటున 20 టన్నుల ఇసుక మాత్రమే సరఫరా చేయాలని విధివిధానాల్లో పొందుపరిచారు. ప్రజలే నేరుగా డిపో వద్దకు లారీ, ట్రాక్టర్, ఎడ్ల బండి వంటి వాహనాలు తీసుకువచ్చి ఇసుకను తీసుకెళ్లవచ్చు. ఇసుక అవసరం ఉన్నవారు ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకునే ఏర్పాటు కూడా చేయనున్నారు. నిర్వహణ చార్జీలు, ఇంకా గ్రామ పంచాయతీలకు ఇచ్చే రూ.88 ఫీజును ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్టాక్ పాయింట్ పరిధిలోని గ్రామ, వార్డు సెక్రటేరియట్ల సిబ్బంది విధుల్లో ఉంటారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా ఫీజు చెల్లింపులు జరిపేలా ప్రత్యేక బ్యాంకు ఖాతాలు సిద్ధం చేశారు. ఇసుక అవసరం ఉన్నవారు నేరుగా తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరు వివరాలను జతచేసి డిపో ఇన్‌చార్జి వద్ద ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. గృహ నిర్మాణరంగం, ప్రభుత్వ అవసరాల కోసమే ఇసుక ఇవ్వనున్నారు.

● ఇసుక సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, గనుల శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నారు. స్టాక్ పాయింట్లకు ఎవరు మొదట వస్తే వారికే కేటాయించే పద్ధతిలో ఇసుక సరఫరా చేస్తారు.

● వినియోగదారులకు ట్రాన్సిట్ రసీదు ఇస్తారు. ఇసుక రవాణా చేసేటపుడు ఈ రిసీట్ తీసుకువెళ్లాలి. తనిఖీల సమయంలో ఈ రసీదు చూపించాల్సి ఉంటుంది.

● గ్రామాల్లో ఉన్న గెడ్డలు, వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. అయితే ఏ గ్రామంలో ఉన్న గెడ్డ, వాగుల నుంచి ఆ గ్రామస్థులు మాత్రమే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతిస్తారు. ఇతర గ్రామాలకు తరలించేందుకు అనుమతించరు.

● జిల్లాలో ఇసుక సరఫరాపై ఆర్డీఓలు, తహసీల్దార్లు నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరా ఫిర్యాదులు, సలహాల కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 9032338135కు ఫోన్ చేసి ఫిర్యాదు లేదా సలహాలు అందించవచ్చు.

● ఉచిత ఇసుక సరఫరాపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు అన్ని మండల, డివిజన్, గ్రామ వార్డు సచివాలయాల్లో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలని గనులశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఇక ఇబ్బందులు ఉండవు

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు నిర్మాణాలు చేపట్టడానికి ఇసుక బంగారంలా దొరికేది. ట్రాక్టర్ ఇసుకను కొనుగోలు చేయాలంటే రూ.4వేలు నుంచి రూ.5వేలు ఉండేది. దీంతో చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా అర్థాంతరంగా విడిచిపెట్టారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానంతో ఇక ఇబ్బందులు ఉండవు.

- శాసపు రాజేష్‌కుమార్, పొనుగుటివలస, రాజాం

ఆనందంగా ఉంది..

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజుల్లోనే ఇసుక విషయంలో సరైన నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. సామాన్యుడు ఇల్లు కట్టుకో లేని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేది. ఈ కారణంగా తాపీ మేస్త్రీలకు పనిలేక చాలా ఇబ్బందులు పడేవారు. కొత్త విధానం తీసుకొచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేయాలి.

-వంగా వెంకటరావు, సర్పంచ్ ఒమ్మి, రాజాం

మళ్లీ ఆ రోజులొచ్చాయి

వైసీపీ నేతల ఇసుక దందా వల్ల గృహనిర్మాణదారులు అప్పుల్లో కూరుకుపోయారు. సిమెంట్, ఇనుము తరువాత ఇసుక కోసం ఎక్కువ మొత్తం ఖర్చుచెయ్యాల్సి వచ్చేది. 2019 సంవత్సరానికి ముందు చంద్రబాబు పాలనలో ఉచిత ఇసుక విధానం వల్ల తాపీమేస్త్రీలు, కాంట్రాక్టర్లకు చేతినిండా పని ఉండేది. మళ్లీ ఆ రోజులొచ్చాయి.

-కె.మురళీ, గృహనిర్మాణదారుడు, గజపతినగరం

ఉచితం హర్షణీయం..

ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయం. సీనరేజీ, వాహనాల అద్దె చెల్లించి ఇసుకను తరలించుకునే వెసులుబాటుతో ప్రజలందరికీ ఉపయోగం. అభివృద్ధి పనులు జరగాలంటే ఇసుక, మట్టి, గ్రావెల్‌ను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

-వంగపండు మురళీధర్, కాంట్రాక్టర్, బొబ్బిలి

గో వధ గుట్టు రట్టు

● డ్రోన్ వీడియోల ఆధారంగా కదలిక

● నిర్వాహకులపై కేసు నమోదు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూలై 7 : విజయనగరంలో గోవధ గుట్టు రట్టు అయింది. ఇన్నాళ్లూ యథేచ్ఛగా సాగుతున్నా అధికారులెవరూ పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గుర్తించి ప్రశ్నించేవారిపై నిర్వాహకులు భౌతిక దాడులకు తెగపడేవారని చెప్పుకునేవారు. తాజాగా సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన డ్రోన్ వీడియోలు గోవధ విషయాన్ని తేటతెల్లం చేశాయి. నగర పోలీసులు ఉరుకులు పరుగులతో అక్రమ కబేళా నుంచి కొన్ని మూగా జీవాలను విడిపించి నిర్వాహకులపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఇద్దరు వాహన డ్రైవర్లపైనా కేసులు పెట్టారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కలెక్టర్ కార్యాలయం సమీపంలో అక్రమ గో వధ చేస్తున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదు. గత పాలకుల ఒత్తిడితో పోలీసులు కూడా అటువైపు వెళ్లేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. వందల సంఖ్యలో మూగ జీవాలను వధించి ఆ మాంసాన్ని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గోవధతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా శనివారం ఓ అజ్ఞాత వ్యక్తి డ్రోన్ కెమెరాతో తీసిన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టారు. అది అంతటా సంచలనమైంది. పోలీసులు ఉలిక్కిపడి ఆ ప్రాంతానికి చేరుకుని 43 మూగజీవాలను విడిపించారు. నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. గోవులను, మాంసాన్ని తరలించే రెండు వాహనాలను కూడా సీజ్ చేశారు.

● గోవధపై ఒకటో పట్టణ సీఐ వెంకటరావును వివరణ కోరగా సోషల్ మీడియాలో వచ్చిన డ్రోన్ వీడియోలు మార్ఫింగ్‌లా అనిపిస్తున్నాయని, కబేలా అనుమానంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తాము కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. 43 పశువులను బయటకు తీసుకొచ్చామని, అవి వధించడానికే తీసుకువచ్చినట్లు అనుమానం కలిగిందని, చట్టప్రకారం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా గోవధ కేంద్రాన్ని మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గో సంవరక్షణ ప్రతినిధులు, గో ప్రేమికులు పెద్ద ఎత్తున నిరశన, ధర్నాలకు సమాయత్తం అవుతున్నారు.



డ్రోన్ కెమెరాలో రికార్డు అయిన చిత్రం

గంట్యాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● బైకులు ఢీకొని ఇద్దరి మృతి


గంట్యాడ, జూలై 7: గంట్యాడ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గంట్యాడ గ్రామానికి చెందిన దివ్వెల హరీష్(27)తో పాటు అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు కంది మణికంఠ కలిసి ద్విచక్ర వాహనంపై గంట్యాడ నుంచి కొర్లాం గ్రామం వెళ్తున్నారు. గంట్యాడ టోల్‌ప్లాజ్ దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, వీరు పరస్పరం బలంగా ఢీకొన్నారు. ప్రమాదంలో దివ్వెల హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108 వాహనంపై ఆసుపత్రికి తరలించగా అక్కడ మరొకరు మృతి చెందారు. మృతిచెందిన వ్యక్తితోపాటు గాయపడిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గంట్యాడ ఎస్ఐ సురేంద్ర నాయుడు పరిశీలించారు. హరీష్ ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు.



ఘటనా స్థలం





కరెంటు కాటు

● ఐదేళ్లుగా జిల్లాలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

● నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

● ఏడాదిలో 27 మంది మృత్యువాత

● గత ఏడాది ఆగస్టులో బాడంగి మండలం పూడివలసలో విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు ఉపాధి కూలీలు మృతిచెందారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో ఘటనాస్థలంలోనే వారు కన్నుమూశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు ఆరోపించారు.

==================================

● గత ఏడాది ఆగస్టు 3న సంతకవిటి మండలం సోమన్నపేటలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. భవన నిర్మాణ పనులు చేపడుతుండగా.. ఇంటిపైనున్న విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు కార్మికులు చనిపోయారు. వారిని కాపాడే ప్రయత్నంలో అంగన్‌వాడీ కార్యకర్త మృతిచెందింది.

==================================

● మూడు రోజుల కిందట మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో కోరాడ ఈశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు మృతి చెందారు. పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. తొలుత భర్త తీగ తగిలి చనిపోగా.. ఆయనను కాపాడే ప్రయత్నంలో భార్య కూడా షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయింది.

రాజాం, జూలై 7: ఏడాది సమయంలో జిల్లాలో విద్యుత్ ప్రమాదాల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకెందరో క్షతగాత్రులై బాధితులుగా మిగిలారు. గత ఐదేళ్లలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు, శిథిలమైన స్తంభాలు, సరిగా పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్లు ఎందరి ప్రాణాలనో కబళించాయి. అయినా వైసీపీ పాలకులు సరిదిద్దే ప్రయత్నం చేయలేదు. అటు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన ఉండేది కాదు. మరోవైపు విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో పాటు పర్యవేక్షించే అధికారులు లేరు. అసిస్టెంట్ లైన్‌మన్లు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఏడీల కొరత అధికంగా ఉంది. పదవీ విరమణతో చాలా పోస్టులు ఖాళీ అవుతున్నా భర్తీ చేయడం లేదు. అటు బదిలీలు, పదోన్నతులతో చాలా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో వినియోగదారులకు అత్యవసర సేవలు అందడం లేదు. ఇటు పాడైన విద్యుత్ పరికరాలతో సిబ్బంది కుస్తీలు పట్టాల్సి వస్తోంది.

అమ్మో విద్యుత్ తీగలు

ప్రస్తుతం పొలాలతో పాటు రోడ్ల వెంబడి ఉన్న హైటెన్షన్ వైర్లు భయపెడుతున్నాయి. చాలావరకు స్తంభాలకు సపోర్టింగ్ వైర్లు లేక ఒక వైపు వేలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలతో పాటు ఈదురుగాలులు వీస్తుండడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితులున్నాయి. వాస్తవానికి హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల మధ్య 50 మీటర్ల నిడివి ఉండాలి. ఈ నిబంధన పాటించడంలేదు. ప్రతీ స్తంభం 4 అడుగుల లోతులో పాతాలి. సమపాళ్లలో కాంక్రీట్ వేసి బలోపేతం చేయాలి. స్తంభం విడిచి స్తంభానికి సపోర్టింగ్ వైరు వేయాలి. అలాగే ఫీజు బాక్సు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన స్తంభానికి సపోర్టుగా మరో స్తంభాన్ని అడ్డంగా ఏర్పాటుచేయాలి. కానీ ఇవేవీ చేయలేదు. దీంతో ఎక్కడికక్కడే స్తంభాలు గాల్లో వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా మారుతున్నాయి.

అసలే వానాకాలం

ఉమ్మడి జిల్లాలో 1600 వరకూ రెవెన్యూ గ్రామాలున్నాయి. దాదాపు 300 మంది వరకూ మాత్రమే సిబ్బంది ఉన్నారు. వర్షాకాలం, ఈదురుగాలుల సమయంలో సిబ్బందిపడే బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు దశాబ్దాలు కిందట వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్లు ఎప్పటికప్పుడు పాడవుతున్నాయి. వాటిని సరిచేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోతోంది. అటు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం మార్చడం లేదు.

చాలీచాలని సిబ్బంది

జిల్లాలో ఏడీలు 21 మంది ఉన్నారు. ఏఈలు 67 మందికిగాను 51 మంది, లైన్‌మెన్లు 172కు 152 మంది, అసిస్టెంట్ లైన్‌మెన్లు 200 మందికిగాను 140 మంది, జూనియర్ లైన్‌మెన్లు 222 మందికిగాను కేవలం 22 మంది మాత్రమే ఉన్నారు. ఒక్కో మండలంలో 50కు మించి రెవెన్యూ గ్రామాలుంటాయి. కానీ ఉండేది నలుగురు లైన్‌మెన్లు మాత్రమే. వీరు కొత్త విద్యుత్ కనెక్షన్లు, మొండిబకాయిల వసూలు, విద్యుత్ మరమ్మతులతో పనిభారం ఎదుర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

జిల్లాలో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తున్నాం. సిబ్బంది కొరత మాట వాస్తవమే. అయినా ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. వర్షాకాలం కావడంతో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు సైతం మంచి సేవలు అందిస్తున్నారు.

- లక్ష్మణరావు, ఎస్ఈ, విద్యుత్ శాఖ,విజయనగరం

దిక్సూచి DIKSUCHI

జాతీయ అత్యవసర పరిస్థితి (1975) ఒక సమగ్ర అవగాహన

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన అవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యదా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్లు నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయ రాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)





ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిశలు - దూరాలు • రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర $_{40}$, తూర్పు $_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$ లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.

DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)

DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

కర్ణము^{2} = $6^2 + 8^2$

కర్ణము^{2} = $36 + 64$

కర్ణము^{2} = 100

కర్ణము = $\sqrt{100}$ = 10మీ॥

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలుతనం

- వైసీపీ హయాంలో పదోన్నతుల్లో ఇష్టారాజ్యం
- వీరభక్త అధికారులకు వరుస పదోన్నతులు
- ఓ డీఈఈ కేడర్ అనతికాలంలో సీఈగా..
- సుప్రీం, హైకోర్టు మార్గదర్శకాలు బేఖాతర్
- ఐదేళ్లూ భయంతో నోరెత్తని బాధిత ఉద్యోగులు
- కూటమి ప్రభుత్వం రావడంతో ఫిర్యాదులు
- వైసీపీ అస్మదీయ అధికారుల భారీ అవినీతి
- భారీ విల్లాలు, బహుళ అంతస్థుల భవనాలపై విచారణ జరిపించాలని కాంట్రాక్టర్ల వినతి
- డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదుల వెల్లువ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎ‌స్)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. సీనియారిటీని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులకు ప్రమోషన్ ఇచ్చారు. వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న వారికి నాటి ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో అతి తక్కువ కాలంలోనే పదోన్నతుల మీద పదోన్నతులు కల్పించారు. సంస్థను అవినీతి మేతగా మార్చేశారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతున్నా అప్పట్లో ఏ ఒక్క అధికారి కూడా ఎదిరించలేకపోయారు. బాధిత అధికారులు కోర్టును ఆశ్రయించినా ఖాతరు చేయకుండా అయినవాళ్లకు అడ్డగోలుగా పోస్టుల సంతర్పణ చేశారు. ఐదేళ్లు మౌన వేదన అనుభవించిన అధికారులు కూటమి ప్రభుత్వం రావటంతో జరిగిన అన్యాయాలపై గొంతెత్తుతున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దల అండదండలతో తమకు తీరని అన్యాయం చేసిన వైసీపీ వీరవిధేయ అధికారులపై తాజాగా డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు బాధిత అధికారులు ఫిర్యాదులు చేశారు. పలువురు కాంట్రాక్టర్లు కూడా అవినీతి అధికారులపై విచారణకు ఆదేశించాలని ఫిర్యాదులు చేశారు. దీన్నిబట్టి గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని వైసీపీ పెద్దలు అవినీతి మేతతో ఎంతగా నిర్వీర్యం చేశారో, వ్యవస్థను ఎంత భ్రష్టుపట్టించారో అర్థమవుతుంది.

వైసీపీ పెద్దల సిఫారసుతో...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు.. విజయవాడ గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ పోస్టును సీనియారిటీ జాబితాలో లేని వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారు. ఈఎన్‌సీ కార్యాలయంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉన్నాయి. ఈఎన్‌సీతో పాటు మరో మూడు సీఈ పోస్టులు ఉన్నాయి. అదనపు సీఈ పోస్టు అవసరం లేదు. కానీ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒక డీఈకి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పదోన్నతి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులకు రోస్టర్ లేదు. ఈఎన్‌సీతో కలిపి నలుగురు చీఫ్ ఇంజనీర్లు ఉండగా.. దొడ్డిదారిన ఐదో చీఫ్ ఇంజనీర్‌గా వైసీపీ ప్రభుత్వ పెద్దలు సిఫార్సు చేసిన డీఈఈని తెరమీదకు తీసుకువచ్చారు. ఆ వ్యక్తి డీఈ కేడర్ అయినా వైసీపీ పెద్దలతో తనకున్న పలుకుబడితో ఇన్‌చార్జి ఈఈ, ఎస్ఈ, సీఈలుగా పలు సందర్భాలలో పని చేశారు. ఆయన కంటే ఎక్కువ సీనియారిటీ గల వారు చాలామంది ఉన్నా.. వారందరిని పక్కన పెట్టి మరీ పదోన్నతి కల్పించారు. ఆయనను రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించినట్టు వైసీపీ వీరవిధేయ ఉన్నతాధికారులు వాదించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆయనకు పదోన్నతి కల్పిస్తే, అదే రిజర్వేషన్ల ప్రకారం సీనియారిటీ ఉన్న పలువురు అధికారులకు న్యాయం చేయాలి కదా? వారికెందుకు న్యాయం చేయలేదన్నది ఇక్కడ ప్రశ్న. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆ డీఈఈకి పదోన్నతి కల్పించారనుకుంటే.. ఆ దామాషా ప్రకారం ఇప్పటికే పదోన్నతులు కల్పించారు. రిజర్వేషన్ల దామాషా పూర్తయితే ఆ పేరుతో అదనపు పదోన్నతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు గతంలో జర్నయిల్ సింగ్ అనే వ్యక్తి వేసిన కేసులో నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ వీరభక్త అధికారికి నిబంధనలకు విరుద్ధంగా ఈఎన్‌సీ పదోన్నతి అందుకునేలా సీనియారిటీని కూడా కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. డీఈఈకి అతి తక్కువ సమయంలో ఈఈ, ఎస్ఈ, సీఈగా పదోన్నతులు కల్పించారు. ఈఎన్‌సీగా పదోన్నతిగా పొందేందుకు కూడా లైన్ క్లియర్ చేశారు. ఓ అధికారికి ఇలా సీనియారిటీ కల్పించటం ఎక్కడైనా ఉంటుందా? ఎంత రిజర్వేషన్లు చూసుకున్నా ఇలాంటి విధానం ఎక్కడైనా ఉంటుందా? అని బాధిత అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో ఎస్సీ, ఎస్టీ పదోన్నతులకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందిగా నిర్దేశించింది. గత వైసీపీ ప్రభుత్వం తెలివిగా ఈ అంశాన్ని తాత్సారం చేయటం కోసం ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇప్పటి వరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవటంతో బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘాలు 2020లో హైకోర్టును ఆశ్రయించాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పదోన్నతులు అమలు చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాలను కూడా వైసీపీ ప్రభుత్వం ఖాతర్ చేయలేదు. తమకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో సీనియారిటీ ఉన్న 20 మంది పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు మళ్లీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు జారీ చేసిన ప్రతిసారీ అమలు చేస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇవ్వటం, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వటం తప్పితే.. పదోన్నతుల విషయంలో మళ్లీ పాత తంతునే పాటిస్తున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ జీఓలు, గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఆర్‌అండ్‌బీ వంటి మిగిలిన ఇంజనీరింగ్ విభాగాలలో తమకు అన్వయించుకుని అమలు చేస్తుండగా.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో మాత్రం అమలు చేయటం లేదు.

అడ్డగోలుగా చెల్లింపులు

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా తమకు అనుకూలంగా పనిచేసిన ఏఈఈలకు డీఈ, ఈఈ పోస్టులను కట్టబెట్టారని, అడ్డగోలుగా ఎంబుక్‌లను రికార్డు చేయించి బిల్లులు చెల్లింపులకు పాల్పడారని బాధిత అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎ‌స్‌ను పూర్తిగా అవినీతిమయంగా మార్చేశారని, శాఖను భ్రష్టుపట్టించారని తమకు న్యాయం చేయాల్సిందిగా పవన్ కల్యాణ్‌కు అభ్యర్థించారు.

అవినీతిపై విచారణ జరిపించండి

వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరభజన చేస్తూ వారి పాపంలో భాగస్వామ్యం పంచుకున్న అవినీతి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టుకున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పలువురు కాంట్రాక్టర్లు ఫిర్యాదులు చేశారు. అవినీతి సొమ్ముతో అక్రమ సౌధాలు నిర్మించుకున్నారని, విల్లాలు, భారీ బహుళ అంతస్థుల భవనాలను కట్టిస్తున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆ దిశగా దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఓ అధికారి భారీగా అవినీతికి పాల్పడ్డారని, పలు ప్రాంతాల్లో బహుళ అంతస్థుల భవనాలు కట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



తాడేపల్లి సమీప కుంచనపల్లిలో కొనుగోలు చేసిన విల్లా



అనంతపురంలో ఓ భవనం, నిర్మాణంలో ఉన్న మరో భవనం



తెలంగాణలో మొయినాబాద్‌లోని గెస్ట్‌హౌస్



పెళ్లి.. చాలా కాస్ట్‌లీ గురూ!

- ఈ ఏడాది అంచనా 10.85 లక్షల కోట్లు
- అమెరికాలో కంటే భారత్‌లో రెట్టింపు వ్యయం

న్యూఢిల్లీ, జూలై 7: ప్రతి మనిషి జీవితంలో ఒకే ఒక్కసారి జరిగే వేడుక పెళ్లి. తల్లిదండ్రులు తమ హోదాకు తగినట్టు ఖర్చుకు వెనుకాడకుండా పిల్లల వివాహాలను వైభవంగా జరిపిస్తారు. పేదలు కూడా అప్పు చేసైనా ఉన్నంతలో చేస్తారు. ధనవంతులైతే కోట్లకు కోట్లు ఖర్చు చేసేస్తారు. మన దేశంలో ఈ మధ్యకాలంలో పెళ్లిళ్ల కోసం చేస్తున్న ఖర్చు బాగా పెరిగిపోతోంది. జెఫరీజ్ గ్రూప్ నివేదిక ప్రకారం... ఈ ఏడాది మన దేశంలో పెళ్లిళ్లకు అయ్యే ఖర్చు దాదాపు రూ.10.85 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా! భారతీయులు ఆహారం, కిరాణ సరుకుల కోసం చేసే వ్యయం తర్వాత పెళ్లిళ్లకు చేసే ఖర్చు రెండో స్థానంలో ఉంది. పిల్లల చదువు కోసం చేసే ఖర్చు కంటే పెళ్లిళ్లకు రెట్టింపు చేస్తున్నారు. భారతీయులు సగటున ఓ పెళ్లికి రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ నెలలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతాయి. దాదాపు 90 శాతం వివాహాలు పెద్దలు కుదిర్చినవే.

ప్రత్యేకతలు

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఏటా దాదాపు 80 లక్షల నుంచి కోటి వివాహాలు జరుగుతాయి. అమెరికాతో పోలిస్తే భారత్‌లో వివాహాలకు రెట్టింపు ఖర్చు చేస్తారు. చైనాతో పోలిస్తే మాత్రం భారత్‌లోనే ఖర్చు తక్కువ.

కొత్త ట్రెండ్

సాధారణంగా వధువు సొంతూరులోనో లేదా వధూవరుల కుటుంబాలకు అనుకూలమైన చోట వివాహ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇటీవల కాలంలో వివాహ సంప్రదాయంలో కొత్త ట్రెండ్ మొదలైంది. డబ్బున్నవారు గోవా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, అండమాన్స్ వంటి ప్రాంతాలకు వెళ్లి అంగరంగ వైభవంగా వివాహ వేడుకలు చేసుకుంటున్నారు.

ఉపాధి

పెళ్లిళ్ల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. కేటరింగ్, డెకరేషన్, గిఫ్టులు, ఫొటోగ్రాఫర్స్, ఎలక్ట్రానిక్స్ ఆటో మొబైల్స్, పెయింట్స్, ట్రావెల్, ప్లానర్స్ తదితరాలకు భారీగా ఖర్చు చేస్తారు. పెళ్లి బడ్జెట్‌లో ఎక్కువగా బంగారు ఆభరణాలకు ఖర్చు చేస్తారు.

పని ఇప్పిస్తామని పడుపు వృత్తిలోకి..

- యువతుల దుస్థితిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్
- వెంటనే చర్యలకు రాష్ట్రాలు,యూటీలకు నోటీసు
- బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసానికి జాతీయ విధానం
- కేంద్రం, రాష్ట్రాలకు హక్కుల కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, జూలై 7: పని ఇప్పిస్తామని చెప్పి, యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దించుతున్న వైనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దీనిపై తమకు అందుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. నిజనిజాలు నిగ్గు తేల్చాలంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. రాంచీ (బిహార్), ఝార్ఖండ్‌లో ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, లాడ్జీలపై దాడులు చేసి అరెస్టులు చేసినప్పుడు చాలామంది మహిళలు తమను బలవంతంగా పడుపు వృత్తిలోకి లాగారని తెలిపారని వివరించింది. కొన్ని అసాంఘిక శక్తులు తమకు పని ఇప్పిస్తామని నమ్మించి ఈ సాలెగూడులోకి తెచ్చి పడేశాయని చెప్పినట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఆ వార్తలు నిజమే అయితే, వెంటనే చర్యలు చేపట్టాలని ఆ నోటీసులో కమిషన్ కోరింది. కాగా, బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసం కోసం జాతీయ విధానం రూపొందించాలని ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా ఎంతమంది ఇటువంటివారు ఉన్నారనే సమాచారంతో జాతీయ స్థాయిలో డేటాబేస్‌ను ఏర్పాటుచేయాలని కూడా తన ప్రతిపాదనల్లో కోరింది. వీటిపై వీలైనంత త్వరగా జా.తీయ సమగ్ర విధానం అవసరమని అభిప్రాయపడింది. భిక్షం ఎత్తాల్సిన పని లేని పరిస్థితులను సృష్టించేలా, ఆ వృత్తిలోని వారు మెరుగైన జీవితం గడపేలా ప్రణాళికలు తయారుచేయాలని కేంద్రం, రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే పలు సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నా, బిచ్చగాళ్ల సమస్య పెరుగుతుండటం పట్ల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.



యూరాలజీ సదస్సులో పాల్గొన్న వైద్యులు

మూత్రనాళాలు సన్నబడుతున్నాయ్

- రోడ్డు ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు కారణం
- ఇటీవల పెరిగిన ఈ శస్త్రచికిత్సల సంఖ్య
- యూరాలజీ సదస్సులో వైద్యుల వెల్లడి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూత్రనాళాలు సన్నబడిపోతున్నాయని, దాంతో శస్త్రచికిత్స చేసి సరిచేయాల్సి వస్తోందని, ఈ తరహా ఆపరేషన్లు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని వైద్య నిపుణులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల మూత్రనాళాలు సన్నబడుతున్నాయని వారు వివరించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 8 దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరయ్యారు. మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సల్లో సరికొత్త ప్రక్రియలపై సదస్సులో చర్చించారు. మూత్రనాళాలు సన్నబడే అవకాశాలు పురుషుల్లో ఎక్కువగా ఉంటాయని, ఇటీవల మహిళలు, పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. మూత్రనాళాలు సన్నబడి మూత్రవిసర్జన తగ్గడం, దానివల్ల సమస్యలు వచ్చినప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందన్నారు. యూరాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్ గంటి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్లు అయినప్పుడు మూత్రనాళాలు కూడా దెబ్బతింటాయని, అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, తర్వాత సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ కాలం పాటు ఆస్పత్రిలో ఉన్నప్పుడు క్యాథటర్స్ అమర్చడం, ఇతర వ్యాధుల వల్ల కూడా మూత్రనాళాలు సన్నబడుతున్నాయన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. దేశంలో మూత్రనాళ శస్త్రచికిత్సల్లో అగ్రగణ్యులుగా పేరొందిన డాక్టర్ సంజయ్ కులకర్ణి (పుణె), డాక్టర్ గణేష్ గోపాలకృష్ణన్ (కోయంబత్తూరు), ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ మాట్లాడారు.

ఆర్భాటం చేశారు.. ఆచరణ మరిచారు



ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి

- వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రోగుల అవస్థలు
- 50 పడకల ఆసుపత్రిలో వెంటాడుతున్న వసతుల లేమి
- ఇదీ బొబ్బిలి సీహెచ్‌సీ పరిస్థితి

బొబ్బిలి

బొబ్బిలి సీహెచ్‌సీలో సమస్యలు పాగా వేశాయి. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం పుణ్యమాని రోగులకు అగచాట్లు తప్పడంలేదు. ఇక్కడ 50 పడకల ఆసుపత్రి ప్రతిరోజూ 350 నుంచి 400 వరకు రోగులు వస్తుంటారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం వసతుల కల్పనకు చర్యలు చేపట్టలేదు. వైసీపీ హయాంలో సీహెచ్‌సీ అభివృద్ధికి ఆర్భాటంచేశారు తప్ప ఆచరణలో అటకెక్కించారు.

ఇదీ పరిస్థితి..

బొబ్బిలి సీహెచ్‌సీలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వైద్యవిజ్ఞాన పరిషత్ నుంచి 3.5 కోట్ల రూపాయలను భవనాలకు మంజూరుచేశారు.దీంతో అప్పట్లోనే దీని స్థాయిని 30 నుంచి 50 పడకలకు పెంచారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీహెచ్‌సీ అభివృద్ధి పడ కేసింది. ఐదేళ్ల ఆర్భాట ప్రకటనలుచేసి కాలయాపనచేశారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. స్థాయిపెంచినా వసతులు కల్పించక పోవడంతో ఇబ్బందులుతప్పడంలేదు. ప్రధానంగా 50 పడకలకు సరిపడా వార్డులు లేకపోవడంతో రోగులను ఎక్కడ ఖాళీఉంటే అక్కడ ఉంచి చికిత్స చేయా ల్సివస్తోంది. ఓపీకి వచ్చేవారికి కూర్చోడానికి సైతం ఎటువంటి వసతులు కల్పించలేదు. దీంతో వారంతా చీటీలు రాయించుకొని వైద్యులు తనిఖీచేసి మందులు తీసుకెళ్లే వరకు అవస్థలు తప్పడంలేదు.


వరండాలో రోగులు

పార్వతీపురం జిల్లా నుంచి రోగులు..

బొబ్బిలి పట్టణం, మండలం నుంచే కాకుండా పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, సీతానగరం, మక్కువ మండలాలతో పాటు పది మండలాలకుపైగా రోగులు నిత్యం వైద్యసేవల కోసం ఇక్కడకు వస్తుంటారు.చరిత్ర గల ఈ ఆసుపత్రిని ఎప్పుడో వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌చేయాల్సిఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడేషన్ నినాదాలకు పరిమితమయ్యిందని పలు ప్రజాసంఘాల నాయకులు చెబుతున్నారు.

వైద్యులు ఉన్నా.. వసతులు లేక

బొబ్బిలి సీహెచ్‌సీలో వైద్యులు ఉన్నా, వసతుల సమస్య వెంటాడుతోంది. ప్రధానంగా చీపురుపల్లి తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఇవే నిధులతో రెండంతస్థుల భవనాలను సమకూర్చారు. బొబ్బిలిలో ఆ నిధులు సరిపడక ఒక అంతస్థుతోనే సరిపెట్టేశారు. పైఅంతస్థు ఉంటే మరికొన్ని వార్డులు, సమావేశ హాలు, వైద్యుల రూములు, పలు విభాగాలకు వసతిసరిపడేది. గైనిక్, చిన్న పిల్లల విభాగం, ఆర్థో, జనరల్ ఫిజీషియన్, ఆప్తాలజీ తదితర 11 మంది వైద్యనిపుణులు ఇక్కడ సేవలందిస్తున్నారు. వసతులు సరిపడా లేకపోవడంతో ఆసుపత్రి అంతా రోగులు, వైద్యులు, సిబ్బందితో కిక్కిరిసి ఉన్నట్లుగా గందరగోళంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి భవనం పైఅంతస్థు నిర్మాణానికి అదనపు అంచనావ్యయంతో ప్రతిపాదనలు పంపించినా ఆ నిధులు విడుదలకాలేదు. ఆరోగ్యశ్రీలో అనేక రకాల వైద్యసేవలు బొబ్బిలి సీహెచ్‌సీలో అందుతున్నాయి. వైద్యులు ఉన్న ప్పటికీ రేడియాలజిస్టు, ఫార్మసిస్టు, ఎస్‌ఎంఏ, జూనియర్ అసిస్టెంట పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో డ్రైనేజీవ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిస్తే ప్రాంగణమంతా అస్తవ్యస్తంగా మారుతోంది. ఆసుపత్రిలో గల పాతభవనాలు, పోస్టుమార్టం రూముతో సహా అన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రోగులు, వారి బంధువులు తీవ్ర అసౌక ర్యానికి గురవుతున్నారు. సిబ్బంది వెయిటింగ్ హాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సర్జరీ గదిలో వసతు లు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

మరో అంతస్థు నిర్మించాలి..



ఆసుపత్రిని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్న మాట వాస్తవమే. పై అంతస్థులో మరో అంతస్థు నిర్మిస్తే సమస్యలు తీరుతాయి. గతంలో ఇచ్చిన నిధులు సరిపడలేదు. మళ్లీ అంచనాలు పంపించాం. నిధులు రావాల్సి ఉంది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. అందుకు తగ్గ వసతులు కల్పించాలి. అత్యవసరంగా వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ప్రాంత రోగులకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. రోగులకు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లుఉండాలి.

-డాక్టర్ శశిభూషణరావు, వైద్యాధికారి, బొబ్బిలి సీహెచ్‌సీ

అన్ని వసతులు కల్పిస్తాం..



పారిశ్రామికవేత్తలు పెద్దమనసుతో ముందుకొచ్చారు. సామాజిక సేవల పథకం కింద కోటి రూపాయలు ఇచ్చేందుకు సమ్మతి తెలపడంతో అధికారులతో చర్చించి బొబ్బిలి, బాడంగి సీహెచ్‌సీలకు అవసరమైన వసతులను కల్పిస్తాం. వందపడకల ఆసుపత్రికి అవసరమైన స్థలసేకరణ కోసం కృషి చేస్తాం. ఆసుపత్రులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

-బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీడితోటల్లో యువకుడు..

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు ఎయిర్‌పోర్టు సమీప జీడితోటలో ఉత్తర ప్రదేశ్‌లోని మదురై జిల్లాకు చెందిన రూప్‌చంద్(28) ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఎయిర్‌పోర్టు పనుల్లో భాగంగా ఎల్అండ్‌టీ కంపెనీలో డ్రైవర్‌గా ఈఏడాది ఫిబ్రవరి నుంచి రూప్‌చంద్ పనిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో రూప్‌చంద్ ఎయిర్‌పోర్టు ప్రాంత సమీప జీడితోటలో చెట్టుకు ఉరివేసుకోవడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వారం రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. రూప్‌చంద్ తమ్ముడు శ్యామ్‌లాల్ మృత దేహాన్ని గుర్తించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ డి.తాతారావు కేసు నమోదు చేశారు.

సీతంపేటలో యువతి...

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన సంధ్య(19) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..పిరికి సామాజిక వర్గానికి చెందిన నెట్టిశ్రీను కుటుంబంతో సీతంపేటలో నివాసముంటున్నారు.ఆయన కుమార్తె సంధ్య కొద్దిరోజులు కిందటే డిప్లోమా పూర్తి చేసి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగానికి కూడా ఎంపికయ్యింది. ఈనేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికులు గుర్తించి 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట తరలించారు. తండ్రి నెట్టి శ్రీను ఫిర్యాదు మేరకు సీఐ చంద్రశేఖర్ కేసు నమోదుచేశారు.కాగా సంధ్య ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో తెలియరాలేదు.

విజయనగరంలో ఒకరు..

విజయనగరం క్రైం: విజయనగరంలోని కణపాకలో నక్కాన శ్రీనివాస రాఘవేంద్ర (33)ఆత్మహత్యకుపాల్పడ్డాడు.పోలీసుల కథనం మేరకు..సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస రాఘవేంద్ర ఓ యువతిని ప్రేమించాడు. అయితే ఆ యువతి వేరే వ్యక్తితో వివాహం చేసుకోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు కుమారుడు రాఘవేంద్ర, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఆత్మహత్యకుపాల్పడడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు:మండలంలోని స్టేషన్‌బూర్జవలస గ్రామ సమీపాన ఉన్న బస్సుషెల్టర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్న కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వారం రోజులుగా వివిధగ్రామాల్లో బిక్షాటన చేస్తున్నాడని, ఆహారం లేక మృతిచెంది ఉంటాడని చెప్పారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుని వయస్సు 55 నుంచి 60సంవత్సరాల మధ్యఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం తరలించారు. మృతుని వివరాలకు 9121109461 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

కారాడ శివారులో చైన్‌స్నాచింగ్

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ ఘటనజరిగింది. బాధితురాలు, పోలీసులకథనం మేరకు.. బాడంగి మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన పార్వతీ కారాడ గ్రామంలో వారాలపండుగ కోసం వచ్చిందిన బంధువుల ఇంట్లో భోజనం చేసి తిరిగి తమ స్వగ్రామానికి కాలినడకన బయలుదేరింది. కారాడ గ్రామ శివారులో పార్వతీ మెడలో మూడుతులాల బంగారం గొలుసు, అరతులం పుస్తెలతాడును గుర్తుతెలియని దుండగులు తెంపుకొని పోయారు.దీంతోపార్వతీ గాయపడడంతో స్థానికులు గుర్తించి బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికితరలించారు.సమాచారం తెలియగానే సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. కాగా ఏమి జరిగిందోతెలియదని, ఒంటిపైగాయాలు, రక్తం కనిపించిందని, మెడలో మూడున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదని ఆమె చెబుతోంది. చెవికి ఉన్న దుద్దుల్లో ఒకటి కింద పడిపోయిఉంది. ముఖంపై కొట్టిన గాయాలు కనిపిస్తున్నాయి. వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో నుంచి గొలుసు, పుస్తెల తాడును దొంగిలించినట్లు అనుమానిస్తున్నారు. ఈఘటనపై దర్యాప్తు నిర్వహిస్తున్నామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పార్వతీకి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

ఆటోడ్రైవర్‌కు గాయాలు

రామభద్రపురం:మండలంలోని ఆరికతోట జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. రామభద్రపురం నుంచి ఆరికతోట వెళ్తున్న ఆటోను వెనుకనుంచి విజయనగరం వైపు వెళ్తున్న కారు ఢీకొందని చెప్పారు.దీంతో ఆరికతోట గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పొట్నూరు ప్రకాష్‌కు గాయాల య్యాయని తెలిపారు. ప్రకాష్‌ను 108లో బాడంగి ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

మడ్డువలస కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

రేగిడి: మండలంలోని చిన్నలింగాలవలస బస్సు కూడలి సమీపంలో ఉన్న మడ్డువలస కుడిప్రధానకాలువలోకి ఆదివారం ఆటో దూసుకువెళ్లింది. దీంతో రణస్థలం మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎన్.సంతోష్‌కుమార్‌కు గాయపడ్డాడు. 108సిబ్బంది కథనం మేరకు.. సంతోష్‌కుమార్ తన ఆటోలో కోళ్ల దాణాను రాజాంనుంచి పాలకొండ వైపు తీసుకువస్తున్నాడు. చిన్నలింగాలవలస సమీపంలో మడ్డువలస కుడిప్రధాన కాలువలోకి ఆటో దూసుకు వెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న దాణా చెల్లాచెదురుగా పడిపోయింది. డ్రైవర్ సంతోష్ కుమార్ పిచ్చిమొక్కల్లో పడిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న సంతోష్‌కు మార్‌ను స్థానికులు బయటకు తీసి 108లో రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగాఉంది. దీంతో శ్రీకాకుళం రిఫర్ చేసినట్లు సమాచారం.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

విజయనగరం క్రైం: విజయనగరంలోని రహస్య ప్రాంతంలో పేకాడుతున్న 11 మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి లక్షా12 వేల 800 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్‌చేస్తాం: సీఐ

విజయనగరం క్రైం: మద్యం సేవించి వాహనం నడిపితే, జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ సీఐ రంగనాథం హెచ్చరించారు. శనివారం రాత్రి విజయనగరంలోని ప్రధాన కూడళ్లల్లో డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో విస్తృతంగా ప్రతిరోజూ డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని,ఎవరైనా తనిఖీల్లో పట్టుబడితే, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిస్తే యాజమానులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్వరరాజు పాల్గొన్నారు.

108 సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు

బాడంగి: 108 సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎరుకులపాకలు గ్రామానికి చెందిన రొంగళి దీపిక కడుపునొప్పి తాళలేక బాడంగి పీహెచ్‌సీలో చేరారని, పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అంబులెన్స్‌తో విజయనగరం రిఫర్‌చేశారని చెప్పారు. ఆమెను విజయనగరం తరలించే సమయంలో ఎరుకులపాకలు వద్ద 108 అంబులెన్స్ ఆగిందని, దీపిక తల్లిదండ్రులతోపాటు పేషెంట్‌కు సహాయంనిమిత్తం మరో ఆమె కూడా అంబులెన్స్‌లో కూర్చొందని తెలిపారు. అంబులెన్స్ సిబ్బంది ఆమెను దిగిపోవాలని కోరారని, ముందుకు వెళ్లకుండా రోడ్డు పక్కనే నిలిపివేసి అక్కడ ఉన్న వారితో వాగ్వాదానికి దిగారని చెప్పారు. వీరిపై అధికారులు కలిసి చర్య తీసుకొని విధుల నుంచి తప్పించాలని కోరారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా పీహెచ్‌సీ ఎదుట పేషెంట్ బంధువులతో కలిసి ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట: నియోజకవర్గంలో గత ప్రభుత్వహయాంలో మంజూరైన ఇళ్ల నిర్మా ణాలపై ఎస్.కోటఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జిల్లా ప్రాజెక్టుడైరెక్టర్ వి. శ్రీనివాస్‌తో సమీక్షించారు. ఆదివారం లక్కవరపుకోటలో పీడీతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 75 వేల ఇళ్లు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా మంజూరయ్యాయని, ఇందులో 42 వేల ఇళ్లు పూర్తయ్యాయని మిగిలినవి వివిధదశల్లో ఉన్నాయని,మార్చి 2025 నాటికి పూర్తిచేస్తామని పీడీ వివరించారు.ఇంకా కావాల్సిన వారికి డైరెక్షన్స్ రావా లన్నారు. అనంతరం సిమెంట్ గోదామును తనిఖీ చేశారు.కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శైవశిల్పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం

రాజాం:సంతకవిటి మండలంగుళ్లసీతారాంపురంలో వెయ్యేళ్ల కిందట గల అపూర్వమైన శైవశిల్పాలకు దేవదాయశాఖ అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని రాజాం రచయితల వేదికనిర్వాహకుడు గార రంగనాథం కోరారు.ఆదివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుళ్లసీతారాంపురం దక్షిణానగల తోటలోని శివాలయంలో పదో శతాబ్దపు లింగం, అలంకరించిన నంది, వినాయకుడి విగ్రహానికి నాలుగు చేతులతో కూడిన సర్పం తదితర అరుదైన శిల్పాలు ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు కళింగ శైలి నంది, కాళికాదేవి విగ్రహం, కళింగానికి చెందిన శివలింగం ఉన్నాయని, ఇవి క్రీస్తుశకం పదినుంచి14వ శతాబ్దం మధ్యలో చెక్కించారని చెప్పారు. సీతారాముల ఆలయం ముఖద్వారంపై ఇదే కాలనీకి చెందిన శృంగార శిల్పం, ఆలయానికి ముందర ఖాళీస్థలంలో లలితాదేవి తదితర ప్రాచీనవిగ్రహాలు ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఈమని శివనాగిరెడ్డిని సంప్రదించగా ఆయా దేవతల విగ్రహాల కాలాలను ధ్రువీకరించారని రంగనాథం చెప్పారు. 350 ఏళ్లుగా బొబ్బిలి రాజుల కాలం నుంచి సీతారామ క్షేత్రంగా పిలువబడే ఈప్రాంతం గంగరాజుల కాలంలో ప్రసిద్ధ శివక్షేత్రమని గతంలో ముగడపేటను గొల్ల సీతారాంపురంగా పిలువబడేదని తెలిపారు. సమావేశంలో పిల్లా తిరుపతిరావు, డాక్టర్ అల్తి మోహన్‌రావు, గార సీతారత్నం పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక


35 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో చదువుకున్న వారంతా 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ పుణ్యగిరి డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థులు కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినచుండూరు వేణుగోపాల్, ఆవాల మోహన్‌రావు, కోన రమణ, వెంపడాపు వెంకటరావు, బండారు జనార్దనరావు, రాజేష్,రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో అప్పటి అధ్యాపకులను సత్కరించారు.

విజయనగరంలో ఓపెన్ చెస్ టోర్నీ

విజయనగరం దాసన్నపేట/విజయనగరం రూరల్: విజయనగరంలో ఆదివారం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. 7, 9, 11, 13 , 15, 17, 19వయస్సుగల గ్రూపుల్లోవారికి జరిగినటోర్నీలో కమిటీసభ్యులు ఎస్.బంగారు బాబు, ఈపు విజయ్‌కుమార్, సన్నిమాస్టర్, సముద్రాల గురుప్రసాద్, రామకృష్ణ, తిరుపతిరావు పాల్గొనగా చీఫ్‌ఆర్బిటర్‌గా రవికుమార్ వ్యవహారించారు.కాగా జూనియర్ విభాగంలో విజయనగరం ఉల్లివీధికి చెందిన రాయప్ప నీతిష్‌కుమార్ యాదవ్ తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నీతిష్‌కుమార్‌ను చందరంగం అసోసియేషన్‌ప్రతినిధులతోపాటు, వ్యాపారవేత్త ముచ్చి విశ్వనాథం, తల్లిదండ్రులు నరేష్, అనూష, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజాంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ దినత్సోవం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయుకులు

రాజాం: రాజాంలో ఎమ్మార్పీఎస్ 30 ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు, మాదిగ విద్యార్థి నాయ కులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఈఎఫ్ అధ్యక్షులు అరసాడ ఆనందరావు మాదిగ, ఏపీ రాష్ట్ర నాయకులు యందవ నారాయణరావు మాదిగ, కోశాధికారి అరసాడ బోసుమాదిగ, బి.విజయ్‌కుమార్, ఓ.విజయ్ కుమార్, వై.ఆనందరావు, వై.రవి, యు.పాలు, టి.మురళి, వై.బుజ్జి, ఏసురత్నం, కిషోర్, పి.అప్పారావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కల్కి కారు

- సెల్ఫీకోసం ఎగబడిన అభిమానులు


రామనారాయణంలో కల్కి బుజ్జి కారు

రింగురోడ్డు : పాన్ ఇండియా చిత్రం కల్కిలో హీరో ప్రభాస్ వినియోగించిన బుజ్జికారు అందరినీ ఆకట్టుకుంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆ వాహనాన్ని ఆదివారం నగరంలోని రామనారాయణానికి అభిమానుల సందర్శనార్థం తీసుకొచ్చారు. ముందుగా ఆలయ అర్చకులు బుజ్జికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా కల్కి చిత్రంలోని బుజ్జి కారు నగరానికి వచ్చిందని తెలుసుకున్న సినీ అభిమానులు, పిల్లలు, యువత పెద్దఎత్తున బుజ్జిని చూసేందుకు రామానారాయణం క్షేత్రానికి తరలివెళ్లారు. ఆకర్షణీయంగా ఉన్న కారును చూసి సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఆ ఫొటో సామాజిక మాధ్యమాల్లో పెట్టి ఆనందించారు.

ప్రత్యేకతలు ఇవీ..: కారుకు 3 చక్రాలు ఉంటాయి. ముందుభాగంలో 2 హబ్‌లెస్ టైర్లు, వెనుక ఒకటి ఉంటుంది. డ్రైవర్‌కు స్పెషల్ సిటింగ్ ఉండగా పైన గ్లాస్ డూం ఉంటుంది. దీని నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు అని, ఇదీ పూర్తిగా ఆర్టిఫీషియల్‌గా పనిచేస్తుందని నిపుణలు తెలిపారు. కార్యక్రమంలో రామనారాయణం ప్రతినిధి రమణ, బుజ్జికారు ఇన్‌చార్జి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు

లక్కవరపుకోట: మండలంలోని రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో కె.గాయత్రి తెలిపారు. జొన్న రకం విత్తనాలు 200 కిట్లు వచ్చాయని, ఒక్కోకిట్టులో ఐదుకిలోలు ఉంటాయని, రాయితీపై రూ.115లకు రైతులకు ఇస్తామని పేర్కొన్నారు.అన్ని రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలు ఈనెల 14 వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని శివానికి రూ.20 వేలు అందజేశారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతు శివాని ఆర్థిక ఇబ్బందులు గుర్తించి డిగ్రీ ఫీజు చెల్లించేందుకు తమ వంతు కృషిచేశామని తెలిపారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ వినాయకనగర్‌లో గల ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు దెందేరు హైస్కూల్ హెచ్ఎం బి.సునీత, పీడీ కృష్ణంరాజు అందజేశారు.కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రవి, సంతోష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, గోవిందరావు, నగేష్, గణేష్ పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

కొత్తవలస: పింఛన్‌దారుల సమస్యలపై ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు కోరారు. ఆదివారం కొత్తవలసలో వివిధ ప్రైవేటు కంపెనీల్లో పని చేసి పదవీవిరమణ పొందిన పింఛన్‌దారుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీలను ఆహ్వానించి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'

బాడంగి:బాడంగిశాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్య క్రమంలో భాగంగా కంప్యూటర్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీతికథలు, దేశనాయకుల కథలు చదివి వినిపించారు.


కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఐ-కార్ ర్యాంకింగ్‌లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నెంబర్-1

- విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డీఎన్‌రావు


డీఎన్‌రావు

పర్లాకిమిడి: అకడమిక్‌ఎక్సలెన్స్‌వ్యవసాయవిద్యపై అంకిత భావంతో ఒడిశాలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తోందని విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ డీఎన్‌రావు తెలిపారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ స్కూల్‌ఆఫ్‌అగ్రికల్చర్ అద్భుతమైన మైలురాయిని సాధించి ఐ-కార్ 2024 ర్యాంకింగ్‌లో నెంబర్ వన్ స్థానం సంపాదించిందని చెప్పారు. ఈ విజయం సాధించడం విశ్వవిద్యాలయానికే గర్వకారణమన్నారు.స్కూల్‌ఆఫ్ అగ్రికల్చర్ నిబద్ధతతో వినూత్న పరిశోధన, ఆచరణాత్మకశిక్షణ ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తూవిద్యార్థులు రాణించేలా పాటుపడుతోందని పేర్కొన్నారు.

చెరువు గట్టుపై నిర్మాణం తొలగించాలి

జామి : భీమసింగి చాకిరేవు చెరువు గట్టుపై నిర్మాణం తొలగించాలని రైతులు కోరారు. ఈమేరకు ఆదివారం ఇక్కడి రైతులు ఓ వ్యక్తి చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా ఇక్కడ ఓ వ్యక్తి పాకవేసుకుని ఉండేవాడని, ఇప్పుడు ఏకంగా చెరువు గట్టుపై రాతి పిల్లర్లు వేసి నిర్మాణానికి పూనుకున్నాడని తెలిపారు. ఈ విషయంపై గ్రామ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశామని చెప్పారు.

విజయనగరంలో ఎరువులు స్వాధీనం


తనిఖీలు నిర్వహిస్తున్న తాతారావు

విజయనగరం రూరల్: విజయనగరంలో 3,94, 818 రూపాయల విలువ గల 2,135 కిలోల ఎరువులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం విజయనగరంలోని ఎరువులు, పరుగుల మందులు విక్రయించే షాపుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ తాతారావు ఆధ్వర్యంలో కైకలూరు డివిజన్‌కు చెందిన వ్యవసాయ శాఖ సంచాలకుడు గంగాధర్, ఏవో ఉమామహేశ్వరనాయుడు తదితరులు తనిఖీలు నిర్వహించారు. నగరంలోని కర్షకరత్న ఆగ్రో కెమికల్స్ షాపులో నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్న వస్తువులను లేబొరేటరీకి పంపించాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారం నిర్వహించరాదని, చట్టపరంగా అన్ని లైసెన్స్‌లు కలిగి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని కోరారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లోగల జగన్నాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రథంపై స్వామివారిని మేళ తాళాలతో ఘనంగా ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


సాలూరు: జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి


పార్వతీపురం టౌన్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర


శృంగవరపుకోట: వేణుగోపాలస్వామి ఆలయంలో రథోత్సవం


పాలకొండ: పూజల్లో ఎమ్మెల్యే జయకృష్ణ


మక్కువలో.. స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు


జామి: జగన్నాథస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


వీరఘట్టంలో..

ఆశీలులో సిండికేట్!

- పంచాయతీల ఆదాయానికి గండి
- అధికారులు, పాటదారులు ఒక్కటై తతంగం
- ఇదేం పద్ధతని ప్రశ్నిస్తున్న స్థానికులు

గజపతినగరం: గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరేలా చూడాల్సిన పాలకులు, అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో నెలకొన్న పరిస్థితి ఇందుకో ఉదాహరణ. ఏటా రెండు గ్రామ పంచాయతీలకు రోజువారీ ఆశీలు వేలంపాట నిర్వహిస్తుంటారు. దీనివల్ల రెండు పంచాయతీలకు లక్షల రూపాయలు సమకూరుతుండేవి. అయితే ఈ పంచాయతీల ఆదాయానికి గండి కొట్టేలా అధికారులు, పాటదారులు కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు తాజాగా వినవస్తున్నాయి.

గజపతినగరం మేజర్ పంచాయతీకి గత ఏడాది రూ.2లక్షల 30వేలకు పాట ఖరారు కాగా, ఈ ఏడాది జూలై 1 నుంచి 3 పర్యాయాలు వాయిదా వేస్తూ రూ.లక్షా 81వేలకు పాట ఖరారు చేశారు. ఈఏడాది ఏప్రిల్, మే, జూన్ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అధికారులే ఆశీలు వసూలు చేశారు. పంచాయతీలో రోజుకు 3నుంచి 4వేల రూపాయలు ఆశీలు రూపంలో వచ్చేది. ఇలా అధికారుల సమక్షంలో వసూళ్లు జరిగితే ఏడాదికి రూ.10 నుంచి 12 లక్షల ఆదాయం పంచాయతీకి వచ్చేది. కానీ పంచాయతీ పాలకులు, అధికారులు, పాటదారుడు సిండికేట్ కావడంతో రద్దు పర్చిన ఆశీల వేలంపాటను పాటదారుడికి లక్షా 81వేలకు ఖరారు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


గజపతినగరంలో కూరగాయలమార్కెట్

- ప్రభుత్వ నిర్ణయించిన ఆశీలు వేలంపాట 3లక్షల 8వేలు కాగా ఈ ఏడాది కేవలం రూ.లక్షా 81వేలకు పాట ఖరారు చేయడంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. అలాగే పురిటిపెంట పంచాయతీకి సంబంధించి గత ఏడాది రూ.2లక్షల 61వేలకు పాట నిర్వహించగా ఈ ఏడాది రూ.లక్షా 69వేలకు పాట జరిగింది. నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం, పురిటిపెంటలో క్రయ విక్రయాలు జరుపుకోనేందుకు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాలనుంచి రైతులు, వ్యాపారులు వస్తుంటారు. అయితే వారి వద్ద నుంచి ఆశీలు వసూళ్లు చేస్తున్న పాటదారుడు ఎటువంటి రసీదు లేకుండా డబ్బులు వసూలు చేస్తారు. పండిన పంటను అమ్ముకోవడానికి తీసుకువచ్చిన రైతుల నుంచి తట్టకు రూ.10 వసూలు చేస్తున్నారు. దీంతో ఎటువంటి రసీదు లేకుండా దౌర్జన్యంగా ఆశీలు వసూలు చేయడం తగదని వాపోతున్నారు. ప్రభుత్వ ధరల పట్టికను జాతీయ రహదారికి ఇరువైపులా బోర్డుల రూపంలో ఏర్పాటు చేస్తే వాటికి అనుగుణంగా ఆశీలు కడతామని వ్యాపారులు, రైతులు అంటున్నారు. వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్‌కు వందల రూపాయలు వసూళ్లు చేస్తున్నారని, జిల్లాలో ఎక్కడా లేని విధంగా గజపతినగరం జాతీయ రహదారిపై ఆశీలు వసూళ్లు చేయడం తగదని పలువురు వాహనదారులు అంటున్నారు. పంచాయతీ అధికారుల నుంచి రసీదు బుక్ తీసుకుని వాటి ద్వారా ఆశీలు వసూళ్లు చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు అనుగుణంగా వసూలు చేయడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఇరు పంచాయతీల అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆశీలు వసూలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పురిటిపెంట జాతీయ రహదారిపై కూరగాయల వ్యాపారులు

చర్యలు చేపడతాం

ఆశీలు వసూళ్లకు సంబంధించి ఎటువంటి అక్రమాలు చోటుచేసుకున్నా పాటదారుడిపై తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆశీలు వసూళ్లు చేయాలి. త్వరలోనే ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.
- ఎం.రమణ, ఈవో, గజపతినగరం పంచాయతీ

అండర్‌పాస్ ఏర్పాటుకు ప్రయత్నిస్తాం

- ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే నాగమాధవి


ఎంపీ, ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం: సవరవల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారికి సంబంధించిన అండర్‌పాస్ రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. జాతీయ రహదారి కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, స్థానికులు ఇటీవల ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎంపీతో పాటు ఎమ్మెల్యే నాగమాధవి ఆదివారం సవరవల్లిలో జాతీయ రహదారిని పరిశీలించారు. వారితో పాటు ఉన్న బంగార్రాజు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపుల అనేక గ్రామాలు ఉన్నాయి.. వాహనాల రాకపోకలకు, బాటసారులు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.. అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.. ఈమేరకు అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారి కారణంగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవలె జాతీయ రహదారి విస్తరణ అధికారులతో మాట్లాడమని, రహదారి సమస్యను పరిష్కరించేలా చూస్తామని చెప్పారు. జాతీయ రహదారిలో ఎక్కడెక్కడ ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి, ఆ సమస్యలను కూడా పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, దాట్ల సూర్యనారాయణమూర్తిరాజు, బొల్లు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే కళా వెంకటరావు


దమరసింగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల: చీపురుపల్లి నియోజకవర్గాన్ని ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆదివారం దమరసింగి గ్రామదేవత పండగలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ సదుపాయాలు సమకూర్చి ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తీసుంటానని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని, విద్య వైద్య రంగాల్లో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గుర్ల, కెల్ల గ్రామాల్లో శుభ కార్యాలకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యవర్గ సభ్యుడు వి.సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, పి.అప్పలనాయుడు, సూర్యనారాయణ, నాగులపల్లి నారాయణరావు, రాజారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాగార్జున


మంత్రి సంధ్యారాణికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాగార్జున

చీపురుపల్లి: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాలూరులోని మంత్రి కార్యాలయంలో కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ప్రజాపిత బ్రహ్మకుమారీస్ భవనంలో మాజీ సీఏపీఎఫ్ జవాన్లు

బొబ్బిలి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ స్థానిక విద్యాలయసంస్థ ఇన్‌చార్జి బి.రాజేశ్వరి తెలిపారు. ఆదివారం సీఏపీఎఫ్ మాజీ జవాన్ల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ వి.హరినాథ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఇక్కడి కేంద్రానికి వచ్చారు.

104 ఉద్యోగుల సమస్యలపై వినతి

సీతానగరం: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్రు ఆనందరావు, చప్ప ప్రసాద్‌రావు కోరారు, ఈ మేరకు ఆదివారం సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. జిల్లా యూనియన్ కోశాధికారి మువ్వల జగదీష్, ఉపాధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను వెనక్కి రప్పించాలి

- అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు


ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

బొబ్బిలి: బొబ్బిలిలోని కళాశాల బీసీ విద్యార్థుల హాస్టల్ కోమటిపల్లికి తరలించారని, దానిని వెంటనే వెనక్కి రప్పించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు ఏబీవీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే స్థానిక కోటలో బేబీనాయనకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ నాయకులు ప్రగడ సత్యనారాయణ, భాగ్ ప్రముఖ్ నక్కాన మాధవరావు, పారిశర్ల ధనుంజయరావు విద్యార్థుల సమస్యలను వివరించారు. కోమటిపల్లి హాస్టల్ నుంచి విద్యార్థులు పట్టణంలోని కళాశాలకు రావడానికి అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారని తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

బొబ్బిలి సింగారపు వీధి వైభవవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బేబీనాయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు పాలూరు బాబు, ఆలయధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, వనమిత్ర కృష్ణదాసు పాల్గొన్నారు.

ఆర్మీ తరహా సౌకర్యాలు కల్పించాలి

ఆర్మీ తరహాలో తమకు కూడా పలు సౌకర్యాలు కల్పించాలని సీఏపీఎఫ్ మాజీ జవాన్ల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ వి.హరినాథ్ కోరారు. ఈ మేరకు బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయనను కలిశారు. కార్యక్రమంలో సంఘం మూడు జిల్లాల నాయకులు రామారావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలంరాజుపేటలో జ్వరాలు

తెర్లాం: మండలంలోని కాలంరాజుపేటలో వారం రోజులుగా జ్వరాలతో పలువురు బాధపడుతున్నారు. పెరుమాళి వైద్యుడు వెంకటేష్ సిబ్బందితో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటి వరకు మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 100 మందికి రక్తపరీక్షలు చేశామన్నారు. 21 మందికి జ్వర తీవ్రత ఎక్కువగా ఉండడంతో శ్యాంపిల్‌ను సేకరించినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు ప్రారంభించామన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారి సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం రాత్రి హుండీ చోరీకి గురయ్యింది. హనుమాన్ జంక్షన్ నిరంతరం స్థానికులు, ఇతరులు సంచరిస్తూనే ఉంటారు. ఆలయానికి భక్తులు నిరంతరం వచ్చి పూజలు చేస్తుంటారు. అయితే ఆదివారం ఉదయం ఆలయానికి ఉన్న తాళాలు పగులకొట్టి ఉండడం గమనించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయాన్ని పరిశీలించగా హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై నాయకులు కొమ్మూరు సుభోషణరావు, ఆళ్ల శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక పోలీసులు వచ్చి ఆలయాన్ని పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించారు.

ఏపీజీఈఏ అధ్యక్షుడిగా శశిభూషణరావు


ఎన్నికైన కార్యవర్గం

బొబ్బిలి: బొబ్బిలి తాలూకా యూనిట్ ఏపీజీఈఏ అధ్యక్షుడిగా స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశిభూషణరావు ఎన్నికయ్యారు. సంఘం నాయకులు చింతల వెంకటసతీష్, సుధాకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా బి.మేరీ జాయ్, కోశాధికారిగా బి.అరుణభారతి, సహాధ్యక్షుడిగా ఈవీ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యు.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.సుజాత, నాగరత్నం, పైడితల్లి, ప్రభాకర్, రామదీపిక, సంయుక్త కార్యదర్శులుగా నల్లి శ్రీనివాసరావు, ఎం.చంద్రశేఖర్, గర్భాపు సురేష్, ఎం.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నూతన వ్యవసాయ విధానాలు తెలుసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుర్ల: రైతులు నూతన వ్యవసాయ విధానాలను తెలుసుకోవాలని ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ప్రకాశరావు సూచించారు. మండలంలోని గుర్ల, గరివిడిలలో నవధాన్యాలు సాగు చేస్తున్న పొలాలను ఆయన ఆదివారం సందర్శించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గిరిడ గ్రామంలో సామూహికంగా వరి విత్తనాలు, బీజామృతంతో విత్తనశుద్ధి చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులకు మొలక శాతం, చీడపీడలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యకుమారి, సంతోషికుమారి, చిరంజీవి, రాజేశ్వరి, కనకదుర్గ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రక్షిత పైప్‌లైన్ లీక్

రేగిడి: మండలంలోని లచ్చరాయపురం వద్ద రాజాం, రేగిడి మండలాలకు వెళ్లే రక్షిత సరఫరా పథకం పైప్‌లైన్ లీకైంది. కొద్దిరోజులుగా ఇక్కడ వందలాది లీటర్ల నీరు నేలపాలవుతోందని స్థానికులు చెబుతున్నారు. లీక్‌లు నివారించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. కాగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, తక్షణమే చర్యలుచేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ తెలిపారు.


లచ్చరాయపురం వద్ద పైప్‌లైన్ నీరు వృథా అవుతున్న దృశ్యం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దత్తిరాజేరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను జాతీయ రహదారిపై మరడాం జంక్షన్ ఆదివారం వద్ద పట్టుకున్నట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా తరలిస్తున్నట్టు అందుకున్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించి, కేసు నమోదు చేశామని తెలిపారు.

బొబ్బిలిలో వైద్యుడికి సన్మానం

బొబ్బిలి: బొబ్బిలిలో గుండె వైద్య నిపుణుడు గుల్ల సూర్యప్రకాశ్‌ను ఆదివారం రోటరీక్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జిల్లా రోటరీ చైర్ జేసీ రాజు మాట్లాడుతూ జన్మభూమిపై మక్కువతో ప్రతి నెలా మొదటివారం బొబ్బిలిలో సూర్యప్రకాశ్ రోగులకు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు సింధ్రీ శ్రీనివాసన్, శ్రీహరి, నాగరాజు, రామకృష్ణ, శంకరరావు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయానికి గరివిడి మండలంలోని వీపీరేగ గ్రామానికి చెందిన లండ కామునాయుడు రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా పట్టణానికి చెందిన దివంగత వెంపలి శ్రీనివాసరావు కుటుంబం తరపున వెంపలి దుర్గాభవాని రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాలను వారు ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, దాసరి రవిశంకర్, ధనూకా, గొల్లస్వామిలకు ఆదివారం అందజేశారు.

మా సమస్యలు పరిష్కరించండి

సాలూరు రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ ఆరోగ్య కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని తమ నివాసంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తెచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, యాప్‌ల భారం తగ్గించాలని, బదిలీలు చేపట్టాలని ఆమెకు విన్నవించారు.